చరమాంకం

అన్నది సుమతి.

అతను కన్నుల్లో కమ్ముతున్న నీటిని బలవంతాన ఆపుకొంటూ సుమతికి దణ్ణం పెట్టాడు.

సుమతి కూడా నీటి పొరలేవో కదిలి ఉండాలి. రోగి చూడకుండా ప్రక్కకు తిరిగి తుడుచుకొంది. అతను స్వింగ్ డోర్ తెరుచుకొని వెళ్ళడం - చెప్పుల చప్పుడు నీరసంగా దూరంలోకి, మెట్ల మీదుగా పోవడం- వీధి వాకిలి దగ్గర రిక్షా గంట మోగడం- విన్నాక గానీ సుమతి ఇటుకేసి తిరగలేదు.

అసలే ఆవిడ మనసంతా ఎందుకో చిరాగ్గా ఉన్నది. దానికితోడు ఈ రోగి-అదే-కాంతారావు- దాన్ని మరింత అల్లకల్లోలం చేశాడు. ఓ దశలో తనను తాను నిగ్రహించుకోవడమే కష్టమయింది. చేతులు వణికాయి. శరీరంయావత్తూ ఏదో ఆవేశించినట్లయి ఉక్కిరిబిక్కిరయి తొక్కిస మక్కిస లాడిపోయింది.

ఇంత జరగడానికీ కారణం- కేవలమూ ఆ పేరు! అది వింటే తన కిప్పటికీ పిచ్చెత్తిపోతుంది. ఒకప్పుడైతే ఆ పిచ్చిలో బ్రహ్మానంద మనుభవించింది తను. ఇప్పుడా పిచ్చిలో కోపం, పగ, క్రౌర్యం పడగలెత్తి బుసలు కొడుతున్నాయి.

పాపం! అతను మాత్రం చేసిన తప్పేముంది గనక!! తన పేరు కాంతారావన్నాడు. తనకు ఏడాదినించీ ఈ నలత ఉన్నదన్నాడు. ఇంత కాలం తాత్సారం చేయడానికి తన దరిద్రమే కారణమన్నాడు. ఇప్పటికయినా తను మంచి మంచి మందులు కొనుక్కోలేనన్నాడు. చౌకలో బాగా బాగా పని చేసే వేమన్నా ఉంటే ఇప్పించమన్నాడు. ఈ రెండింటికీ ఎక్కడా పొత్తు కుదరదని ఈ దురదృష్టవంతుడికి తెలీదు.

ఈ మాటలన్నీ వింటూ తను రోగి ముఖంలోకి చూసినప్పుడు అందులో- దగా, మోసం, దౌష్ట్యం, దుర్మార్గం, తనకగుపించాయి. నిజంగా అతనిలో ఇవేమీ లేకపోవచ్చు. ఆ పేరు పట్ల తనకున్న ద్వేషం వల్ల, తనే వీటన్నింటినీ అతనిలో చూసి ఉండవచ్చు. ఇందులో ఏది నిజమో తనిప్పుడు తేల్చుకోలేదు. కానీ- ఆ క్షణాన, అకారాలా తను అలాంటి అనుభూతులకే లోనయింది!

ఆలోచిస్తుంటే తను అనుకొన్నదానికీ ఇప్పుడయిన దానికీ ఎక్కడా సంబంధమే లేదు. జీవిత సూత్రాలు తన చేతుల్లో లేవనీ, ఎవరో వాటిని చేజిక్కించుకొని, యథేచ్ఛగా తనను ఆడించుతున్నారనీ అనిపించుతోంది! తను ఎక్కడ

ప్రయాణం ప్రారంభించింది? ఎక్కడకు చేరుకుంది?? ఈ మధ్య కాలంలో ఎన్నో తుఫానులు ఉప్పెనలు తనను కకావికలు చేశాయి. అనేక సార్లు ఈ జీవితానికి చరమగీతం పాడేద్దా మనిపించింది. కానీ ఏదీ మన చేతుల్లో లేదనీ, అనూహ్యమైన మరేదో శక్తికి మనమంతా కట్టుబడి ఉన్నామనీ ఒక్కొక్క అనుభవమే రుజువు చేయసాగింది.

తనిలా కావడానికి కాంతరావు - అదే - కాంతం - ముఖ్యకారణమని, ఇప్పటికీ, తన నమ్మకం, ఒక వ్యక్తి జీవితాన్ని, ఎంతగా ధ్వంసం చేయడానికి వీలున్నదో, అంతా చేశాడు కాంతం! ఇందులో తప్పెవరిదన్న ప్రశ్నకు తావే లేదు. తన్నడిగితే, 'కాంతందే త'ప్పంటుంది. బహుశా - అతను తనదే తప్పనవచ్చు. ఈ వాదవివాదాల మాటకేంగానీ, దీని ఫలితంగా సర్వనాశన మయింది మాత్రం తనే!

అసలు కాంతంతో పరిచయం కావడమే చిత్రంగా జరిగింది. ఎవరో ఏదో అన్నదానికి, తను ఉడుక్కొని, ప్రిన్సిపాల్‌తో రిపోర్టు చేసింది. ఆయన గారు కాంతాన్ని పిలిచి, నాలుగు చివాట్లు వేసి పంపించారు. అతనేమీ అనలేదు. వంచిన తల ఎత్తకుండా అన్నీ భరించాడు. తరువాత నిశ్శబ్దంగా బయటికెళ్ళి పోయాడు. రెండు మూడు రోజుల పాటు అతనెక్కడా కనిపించలేదు. నాలుగో రోజున తనకో ఉత్తర మొచ్చిందంటూ నాన్నగా రిచ్చారు. అది కాంతం రాసింది! తనను కలుసుకోవడానికి - ఇంటి దగ్గర కలుసుకోవడానికి-

ఎప్పుడు వీలుంటుందో తెలియ చేయమన్నాడు. తన ఎడ్రెస్ కూడా ఇచ్చాడు. పోనీ కనిపిస్తే చెబుదామనుకొంది తను. వారందాకా, ఎక్కడా పత్తాలేదు. ఆఖరుకో కార్డు రాసి పడేసింది. మొన్న వచ్చాడు. ఎంత బితుకు బితుగ్గా వచ్చాడు! మాటల్ని కూడా ఎంత తేలిగ్గా అనేవాడు; అవి ఎక్కడ నలిగి పోతాయోనన్నంత భయంగా! నాన్న అట్టే పట్టించుకో లేదు గానీ; తను మాత్రం, అదే పనిగా కాంతాన్ని చూడ సాగింది. పసివాడి కన్నా అధ్వాన్నంగా అతను కళ్ళంట నీళ్లు పెట్టుకోడం చూస్తే 'అయ్యో పాపం!' అనిపించింది తనకు. ఇలాంటి 'అర్భకుడు' మీద రిపోర్టిచ్చినందుకు, ఎంత బాధ పడిందో తనకు తెలుసు, భగవంతుడికి తెలుసు!

బహుశా - ఆ మంచితనమే, ఆ అమాయికత్వమే, తనను, ఆకట్టి ఉండాలి. అతన్ని చూస్తుంటే, పసిబిడ్డను చూస్తున్నట్లనిపించేది తనకు. అతని మాటలు కూడా అంత 'ఇది' గానూ ఉండేవి. ఓ రకంగా అతనుత్త పిచ్చివాడనుకొంటుందేది తను! ఆ పిచ్చికి తోడు, పిరికితనం కూడా ఉన్నదేమో, సుడిగాలిలోని వొగుడాకులాగా, మనిషి ఇట్టే అల్లల్లాడి పొయేవాడు. కొంచెం గట్టిగా మాట్లాడితే, రవంత సేపు కళ్ళెర్ర చేస్తే చాలు, తనలోకి తను ముడుచుకొని, మూతిని, సున్నాలా బిగించి, చూపుల్ని అంతర్ముఖం చేసుకొని - అలా అయిపోయేవాడు. ఆ రూపంలో అతన్ని చూస్తే తనకు జాలి, నవ్వూ కూడా వచ్చేవి. అతన్ని ఏదో మిషతో పడిపించి,

బెదిరించి, ఆనందించడం తనకో సరదాగా ఉండేది.

నాన్నకూడా అతనంటే ఎంత అభిమానమో!

'బుద్ధ భగవానుడు' అంటూండే వాడు నాన్న.

'తను మాత్రం, ఏడిపించా లనుకొన్నప్పుడు 'బుద్ధూ' అని పిలిచేది. అయినా అతను ఉడుక్కొనే వాడు కాడు. నిశ్శబ్దంగా నవ్వేవాడు; పసిపిల్లలు మాత్రమే నవ్వ గలిగినంత నిర్మలంగా.

కాంతం - ఇంతలా - వానపాములా, మారడానికి కారణం అతని పరిస్థితులే ననేవారు నాన్న! ఎంత పేదరికమో పాపం! పైగా పెళ్ళి కావలసిన చెల్లెళ్ళు కూడా ఉన్నారట' అదీగాక తండ్రికి ఎప్పుడూ జబ్బు. ఆ ఇంతలోనే ఏదో సర్దుకొని తనకు పంపుతూ ఉంటారట! అంచేత తను సరదాలకూ, వాటికీ దూరంగా ఉంటాట్ట. పోనీ, ఉంచమని ఏదన్నా ఇచ్చినా పుచ్చుకోడు. 'తన మీద ఖర్చు చేసిన ప్రతి పైసా వృథా' అంటూండే వాడు.

—తనెన్నోసార్లు ఒంటరిగా, అతని గది కెళ్ళింది. ఓ మూల స్టౌ, గిన్నెలు, చెంచాలు, ఇంకో మూల, ఉతికి ఆర వేసుకున్న గుడ్డలు, మంచం కింద ట్రంకుపెట్టె, ఆ ప్రక్కనే చీపుర్లు, చేటలు - ఇలా ఉండేది గది! తమ ఇంటికి రమ్మన్నది! 'ఓ' ననడు, పోనీ 'కా'దనైనా అనడు. 'చూద్దాం' అంటాడు. ఇంతకుమించి మరో మాట అతని నోటంట చెప్పించడం తనవల్ల కాలేదు.

అమ్మకయితే ఇష్టంలేదు గానీ నాన్న 'సరే' నన్నాడు. "డబ్బు పెట్టి మనుషుల్ని కొంటాంగానీ మనసుల్నెక్కడ కొంటామమ్మా?" అనేవాడు నాన్న. కాంతం లాంటి వాడు, అంత మంచివాడు కాస్త కలిగిన కుటుంబాల్లో ఉండేందుకు అవకాశం లేదని, నాన్న సిద్ధాంతం!

ఇంత సులభంగా ఈ సమస్య పరిష్కారమవుతుందని తనూ అనుకోలేదు. ఈ వార్త కాంతం చెవిన వేతామనీ, అప్పుడతని ముఖం ఎలా మారుతుందో, చూడాలనీ తనకు అనిపించింది! తను వెళ్ళే సరికి కాంతం, కంది పచ్చడి రుబ్బుతున్నాడు. తనను చూసి నవ్వి, చేతులు కడుక్కొచ్చాడు. తను చిన్నగా అసలు విషయం బైట పెట్టింది. ముందుగా కాంతం నవ్వలేదు. యధాప్రకారం నత్తలాగా ముడుచుకుపోయి, మూతిని సున్నాలా బిగించి, చూపుల్ని అంతర్ముఖం చేసి- అలా అయిపోయాడు. తను 'నిజమే' నన్నది. 'నాన్న రమ్మంటున్నా' రనీ అన్నది. 'పోనీ బతిమిలాడించుకోదలిస్తే నాన్నే వస్తా' రని కూడా అన్నది.

అతను ఒక్కసారి చలించిపోయాడు. కళ్ళింత చేసుకొని తనకేసి చూశాడు. ఆ చూపుల్లో ఏమున్నదో తను చదువుకోలేక పోయింది. రవంత సేపయాక—

"పద, వస్తాను" అన్నాడు.

అంతే !

అదే ఆఖరి మాటవుతుందని గాని, అదే చివరి చూపవు

తుందని గానీ అనుకోలేదు. అతని కోసం ఆ క్షణం నుండీ తను ఎదురు చూస్తూనే ఉన్నది! అప్పటికీ, ఇప్పటికీ, అతను రాలేదూ, తను చూడనూ లేదు.

ఈ లోగా, జరగవలసినవన్నీ జరిగిపోయాయి. అమ్మ దాటిపోయింది. నాన్న జబ్బున పడ్డాడు. ఆ వ్యాధితో నాన్న పడుతున్న బాధ చూశాకే, తను డాక్టరీ చదువును ప్రారంభించింది. తను- ప్రాక్టీస్ చేయడం- నాన్న కళ్ళారా చూడనే లేదు.

ఆ ఇంత కాలంలోనూ, నూరేళ్ళ బ్రతుకు తను వెళ్ళబోసింది. జీవితంలో, తను కావాలనుకొన్న దొకటైతే, తనకు లభించింది మరొకటి! ఈ ఉన్నదానితో తనెందుకు రాజీ పడిందన్న ప్రశ్నకు, జవాబు చెప్పుకోలేదు.

'జీవితానికి అర్థం లేదు'

అదొక్కటే జవాబు.

కాకపోతే—

సుమతి చటుక్కున తలెత్తి చూసింది! వాకిలి ముందొక రిక్షా ఆగి ఉంది. అందులోంచి ఓ అస్థిపంజరాన్ని, రిక్షావాడూ, మరో అస్థిపంజరమూ, కిందికి దించుతున్నారు. సుమతి స్వింగ్ డోర్సును తెరిచి ఉంచింది, ముగ్గురూ, హాల్లోకి వచ్చారు.

అస్థిపంజరం బల్లమీద కూచోలేక తూలిపోతుంటే, పడుకోబెట్టమన్నది! తలదగ్గర, అస్థిపంజరం వెంట వచ్చినావిడ మరో పుడక- గుడ్డ నీరు గుడ్డ కుక్కుకొంటూ కూచున్నది.

"ఏమిటి ?" అంటూనే, స్టెతస్కోపు తీసింది సుమతి.

"అన్నయ్యకు—"

సుమతి నిలువునా చలించిపోయింది. మైకం కమ్మినదాని లాగా ఊగిసలాడిపోతూ, అదే బల్ల మీదికి జారగిలబడిపోయింది. కళ్ళు మూసుకుపోయాయి. కనురెప్పల్ని తొలుచుకొని, నీటి జాలులు, చెక్కిళ్ళ మీదుగా, కిందికి జారుతున్నాయి. పెదవులు, అస్పష్టంగా, బాధగా, గొణుగుతున్నాయి. మధ్య మధ్య, అంతరాంతరాల్లోని ఏదో బాధను, అపనయించుకొంటున్నట్లు సన్నని మూలుగు—

రోగి కళ్లు మూసుకొని, అదేపనిగా, రొప్పుతున్నాడు.

చెల్లెలు చెబుతున్నది :

"నిన్నటిదీ మొన్నటిదీ కాదండీ! ఎన్నో ఏళ్ళ నుండీ అన్నయ్య కీ జబ్బున్నది... అయినా చెప్పాడు కాదు... చెప్పినా చేయగలిగిందేమీ లేదనుకోండి.... అదేదో శాపం పెట్టినట్లుగా, మా తాత, నాన్న, అన్నయ్య; అందర్నీ పీల్చి గుల్ల చేస్తూనే ఉన్నదమ్మా! మీరు ఈ జబ్బులో స్పెషలిస్టులని విన్నాను. అన్నయ్యను తీసుకొచ్చాను".

ఇంకెవ్వరూ లేకపోతే, సుమతి భోరుమని, గుండెలు బాదుకొని ఏడ్చి ఉండేది. ఆధునిక నాగరికత, ఆవిడ కీ అవకాశం లేకుండా చేసింది!

చాలాసేపు, సుమతి ఏమీ మాట్లాడలేదు. పొంగి పొంగి వస్తున్న దుఃఖాన్ని ఆపుకోవడం, రాను రాను అసాధ్య మవు

తున్నది. రవంత సేపు కళ్ళు మూసుకొన్నది. వణికిపోతున్న పెదవులను ప్రయత్నపూర్వకంగా బిగబట్టింది. సన్నగా నిట్టూర్చింది !

"నువ్విక్కడే ఉండమ్మ ! పరీక్ష చేసి చెబుతాను".

చెల్లెలు, చేతులు ఎత్తి సుమతికి నమస్కరించి :

"దిక్కులేని వాళ్ళం డాక్టరమ్మగారూ ! ఏం చేసినా మీదే భారం!" అంది.

రోగిని లేపి కూచోబెట్టింది సుమతి. అతనోసారి కళ్ళు విప్పి, డాక్టరును చూశాడు. ఆ క్షణకాలంలో, అతని కళ్ళల్లో, ఏదో మసక మసగ్గా, సన్నని వెలుగు మెరిసి, మాయమయింది. రోగి పెదవులు, నీరసంగా, గొణిగాయి.

అతన్ని లేపి నిలుచోబెట్టింది సుమతి. తూలకుండా, దగ్గిరగా అనుకొని, ప్రక్కనే ఉన్న గదిలోకి తీసుకుపోయింది.

ఓ నిమిషం తరువాత తలుపులు మూసుకొన్నాయి.

కాస్సేపయ్యాక—

చిన్న మూలుగు, దబదబమన్న చప్పుడూ వినిపించి—

చెల్లెలు తలుపు తీసింది ఆత్రంగా.

అన్నయ్య, నిర్జీవంగా, తెల్లని పక్కమీద పడుకొని ఉన్నాడు.

సుమతి, పాలరాతి గచ్చుమీద, బోరగిల పడి ఉంది !

ఆమె కల్లంత దూరంలో, పసుపుపచ్చని మందుసీసా, ఈ భీకర దృశ్యానికి, సాక్షీభూతంగా పడి ఉంది !